యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిఖిల్ సాయి



మల్లాపూర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నాచారం డివిజన్‌కు చెందిన నిఖిల్ సాయి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన 5214 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా నిఖిల్ సాయి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న కమిషనర్

బోడుప్పల్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బోడుప్పల్ కమిషనర్ రామలింగం మేడిపల్లి మండల పరిధిలోని పలు పాఠశాలలను పరిశీలించారు. జిల్లా పరిషత్‌స్కూల్, ఇందిరానగర్ మండల పరిషత్ పాఠశాల, మేడిపల్లి మండల పరిషత్ స్కూల్‌లో పారిశుద్ధ్యం, టాయిలెట్స్, భోజనశాల, వండిన వంటలు, మెనూను పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ఉప్పల్: ఉప్పల్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాతా బృందాలు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. మండల పరిధిలోని ఉప్పల్, నాగోల్, ఫతుల్లాగూడ, బండ్లగూడ, నాగోల్ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు కొనసాగాయి.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



మల్కాజిగిరి: అనంత సరస్వతీనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు శుక్రవారం రాత్రి అర్చకులు రాజశేఖరశర్మ, గురురాజ, సాయి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. శనివారం ఉదయం విశేష అభిషేకం, సుబ్రహ్మణ్య హోమం, సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో వేడుకలు ముగుస్తాయని దేవాలయ చైర్మన్ హరీష్, ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు.



నివాళులర్పిస్తున్న బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్



ఉప్పల్ చౌరస్తాలో..



ఆనంద్‌బాగ్ చౌరస్తాలో..

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నేతలు అన్నారు. శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్, నాచారం,మల్కాజ్‌గిరి డివిజన్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.మల్లాపూర్‌లో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓల్డ్ మల్లాపూర్‌లో గ్రేటర్ కాంగ్రెస్ నేత నెమలి అనిల్ కుమార్, నాచారంలో బహుజన సమాజ్ పార్టీ నేతలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

– ఉప్పల్,మల్కాజ్‌గిరి (జోన్ బృందం)



మల్లాపూర్‌లో..



నాచారంలో..



చింతల్‌బస్తీలో..



వెంకటాపురంలో..



కాప్రా డివిజన్ సాయిరాంనగర్‌లో ..



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



అల్వాల్‌లో..



గౌతంనగర్‌లో.



ఇందిరానెహ్రూనగర్‌లో..

డివిజన్ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మల్లాపూర్ బాబానగర్ లో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.డీఈ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక నేతలు రాపోలు సతీష్, కుంటికృష్ణ, తండావాసుగౌడ్, శ్రీనివాస్, సీతాల వీరాస్వామి, పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ

గౌతంనగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి భాష్యం స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తెలివితేటలకు నిత్య జీవిత సమస్యల పరిష్కారానికి వాడాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడరాదన్నారు. అనంతరం నూతనంగా మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సాకేత్‌రామ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మైఖేల్, సీఈవో చైతన్య, జెడ్ఈవో మార్కండేయులు, వివిధ బ్రాంచీల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో బంద్‌కు బీఎంఎస్ దూరం



మాట్లాడుతున్న రవిశంకర్

మల్కాజిగిరి: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం చేపట్టనున్న ఆటో బంద్‌కు బీఎంఎస్ ఆటో యూనియన్ మద్దతు ఇవ్వడం లేదని బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, బీఎంఎస్ ఆటో యూనియన్ బి.పెంటయ్యగౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజిగిరిలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం తెలంగాణ జేఏసీ బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. ఈ బంద్‌తో బీఎంఎస్‌కు సంబంధం లేదన్నారు. ఈ నెల 4న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలను వివరించామని, కోదండరాం ఆధ్వర్యంలో అన్ని సంఘాలతో చర్చిస్తామని హామీ ఇచ్చారన్నారు. కోదండరాం కూడా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వం దిశగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ప్రణాళికాబద్ధంగాగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ.54 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాచారం ఓల్డ్ విలేజ్‌లో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ భూగర్భడ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారానికి. సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసినందుకు నాచారం ఓల్డ్ విలేజ్‌వాసులు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ. ఏఈ కీర్తి, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

బోడుప్పల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రమణమ్మకు రూ 60వేలు, ప్రసాద్‌కు రూ. 35వేలు, సీతారాంరెడ్డి రూ.60వేలు, నర్సారెడ్డి 60వేలు, ఆగమ్మకు రూ.60వేలు చెక్కులను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి జైపాల్‌రెడ్డి, సిసిందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

చర్లపల్లి జైలులో పరివర్తన్–ప్రిజన్ టు ప్రైడ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కాప్రా: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్లపల్లి సెంట్రల్ జైలులో శుక్రవారం పరివర్తన్–ప్రిజన్ టు ప్రైడ్ కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా 2021లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా జైలు జీవితం గడుపుతున్న అనేక మందిలో పరివర్తన తీసుకువచ్చేందుకు కృషి చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో చేపట్టిన ఈ కార్యక్రమం ఫేజ్ –9లో భాగంగా చర్లపల్లి సెంట్రల్ జైలులో నిర్వహించిన కార్యక్రమం ద్వారా 2,500 ఖైదీలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మల్కాజిగిరి: గుర్తుతెలియని వ్యక్తులు వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వర నగర్‌కు చెందిన నాగజ్యోతి శుక్రవారం ఉదయం రైల్వేక్వార్టర్స్ ప్రశాంత్‌నగర్ సమీపంలో వాకింగ్ చేస్తుండగా బైక్‌పై ఇద్దరు యువకులు అక్కడికి వచ్చారు. వెనుక కూర్చున్న యువకుడు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా గట్టిగా పట్టుకోవడంతో కిందపడింది. దీంతో వారు సగం గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

మేడిపల్లి: విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టంలో ఉన్న శిక్షలను వివరించారు. నేర కార్యకలాపాల్లో చిక్కుకుని భవిష్యత్తును నాశనం చేసుకోరాదని సూచించారు. లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, పుట్టిన గ్రామానికి పేరు తేవాలన్నారు. తద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం విద్య, భోజన సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం

ఘనంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్, ఈఓ మఠం వీరేశం, యజ్ఞాచార్యులు విజయ సారథి, అర్చకులు రఘు పంతులు, వంశీ, శ్రీనివాస్, రమణ, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, శివరామకృష్ణ, రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ ఓల్డ్ నేరెడ్‌మెట్ యాదవబస్తీ–సెయింట్ థామస్ స్కూల్ సమీపంలో రూ.7 లక్షలతో చేపట్టిన యూజీడీ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల నిర్వహణ సమయంలో ఇబ్బందులు ఎదురైనా ప్రజలు సహకరించాలన్నారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. యూజీడీ పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం రాజు, నాగార్జున, బాబు, శ్రీశైలం, వెంకటేష్, థామస్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

ఘనంగా మద్దిదొరసానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రామంతాపూర్: మధురానగర్‌లో శుక్రవారం గ్రామ దేవత శ్రీ మద్ది దొరసానమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజిస్తే అన్ని శుభాలే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నామ్ బుచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, ప్రధాన అర్చకుడు మోత్కూరి శేఖర్‌బాబు శర్మ, ప్రవీణ్ శర్మతో పాటు ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మల్లాపూర్: మల్లాపూర్ భవానీనగర్‌లోని సహస్ర ప్లే స్కూల్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌కు పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సహస్ర పాఠశాల కరస్పాండెంట్ సందీప్ కుమార్, ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రాండ్ పేరెంట్స్‌తో కరస్పాండెంట్ సందీప్‌కుమార్



నల్లమందు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నల్లమందు

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన బహదూర్ గుర్జర్ నగరానికి వలస వచ్చి ఉప్పల్ గణేష్ నగర్‌లో ఉంటూ టైలర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో అతను రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణ్ మాలిక్ వద్ద నల్లమందు తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు, ఉప్పల్ పోలీసులతో కలిసి శుక్రవారం అతడి ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా నిందితుడు బహదూర్ గుర్జర్‌ను అదుపులోకి తీసుకుని కిలో నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. బైక్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు.